క్లుప్తంగా

మైనార్టీల సంక్షేమానికి కృషి



జాషువాగిరిని సత్కరిస్తున్న పాస్టర్లు

కరప: రాష్ట్రంలో మైనార్టీల సంక్షేమమే ధ్యేయంగా సీఎం జగన్ కృషిచేస్తున్నారని జిల్లా క్రిస్టియన్ మైనార్టీ అధ్యక్షుడు రెవరెండ్ డి.జాషువా గిరి పేర్కొన్నారు. మండలం వేళంగిలోని బైబిల్ మిషన్ ప్రార్థనా మందిరంలో మంగళవారం డాక్టర్ ఆర్.ప్రతాప్‌కుమార్ అధ్యక్షతన జరిగిన మండల పాస్టర్స్ ఫెలోషిప్ సహవాస కూడికలో పాల్గొని మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా కొత్త చర్చిల నిర్మాణానికి, పాత వాటిని అభివృద్ధి చేయడానికి నిధులు మంజూరు చేయడం ముదావహమన్నారు. జాషువాగిరిని మండల పాస్టర్స్ ఫెలోషిప్ సత్కరించింది. దైవజనురాలు టి.బేబీరాణి కుటుంబ సభ్యులు జ్ఞాపికను అందజేశారు. మండల పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు డాక్టర్ పి.డేవిడ్‌రాజు, కన్వీనర్ పి.సత్యప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల సాకారం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బారావు

కరప: జగనన్న అందజేసిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టి సొంతింటి కలను నెరవేర్చుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి కోరారు. స్థానిక చిరంజీవి కళ్యాణమండపంలో మంగళవారం సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన లేఅవుట్–2 లబ్ధిదారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమయ్యే విద్యుత్, తాగునీరు వంటి సౌకర్యాలతో పాటు, అప్రోచ్ రోడ్లు వేస్తున్నారని, సిమెంట్, ఐరన్, ఇసుక ఇస్తున్నారని అవగాహన కల్పించారు. అంతకు ముందు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, ఇన్‌ఛార్జ్ కార్యదర్శి కేశవరావు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పార్కిన్‌సన్స్‌పై అవగాహన



డాక్టర్ కామరాజును సత్కరిస్తున్న ఐడీఏ సభ్యులు

బోట్‌క్లబ్: ప్రపంచ పార్కిన్ సన్స్ దినోత్సవం సందర్భంగా ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బోట్‌క్లబ్ వద్ద ఉన్న ఎస్వీ న్యూరో ఆసుపత్రిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ నరాల నిపుణుడు బెజవాడ కామరాజు నర సంబంధ వ్యాధులను వివరించి పలు సూచనలిచ్చారు. ఐడీఏ మాజీ అధ్యక్షుడు అడ్డాల సత్యనారాయణ డాక్టర్ కామరాజును సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు వెదురుపాక సతీష్, కార్యదర్శి సువర్ణ, సభ్యులు చైతన్య, రఘురాం, పద్మావతి పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న వస్త్ర ప్రదర్శన



జ్యుయలరీ కొనుగోలు చేస్తున్న మహిళలు

బోట్‌క్లబ్: స్థానిక నాగమల్లితోట జంక్షన్ వద్ద ఉన్న ద్వారంపూడి భాస్కర్‌రెడ్డి, పద్మావతి కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన వసుధ ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ నగర మహిళలను ఎంతగానో ఆకట్టుకుంటోంది. నిర్వాహకులు ప్రవీణ్‌కుమార్, సీతాకాంత్ మాట్లాడుతూ గృహిణులు, మహిళలు, విద్యార్థినులకు ఉపయోగపడేలా దేశ నలుమూలలు నుంచి 50 పైగా డిజనర్లు రూపొందించిన వస్త్రాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. ముంబై, ఢిల్లీ, అహ్మదాబాద్, జైపూర్, కోల్‌కత్తా, మధ్యప్రదేశ్, చెన్నై, హైదరాబాద్ నగరాల నుంచి లేటెస్ట్ డిజైనర్ వస్త్రాలు పరిచయం చేసినట్లు తెలిపారు. వీటితో పాటు మహిళలకు ఇష్టమైన జ్యూయలరీ ఈ ప్రదర్శనలో ఉంచామని, ప్రదర్శన గురువారం రాత్రి 9 గంటలు వరకూ ఉంటుందన్నారు. నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రోడ్లపై చెత్త వేస్తే జరిమానా

కాకినాడ: చెత్తను రోడ్లపై వేస్తే జరిమానా విధిస్తామని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన వెంకట్‌నగర్, రాజ్యలక్ష్మినగర్, మెయిన్‌రోడ్డు, ఆదిత్య పీజీ కళాశాల ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. ఆయన వెంట శానిటరీ సూపర్‌వైజర్ జిలానీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పి.రాజేంద్రప్రసాద్, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

జగన్‌తోనే ఉజ్వల భవిత

- ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రెడ్డి
- వాడవాడలా 'జగనన్నే మా భవిష్యత్'



జగనన్నే మా భవిష్యత్‌లో ప్రశ్నలకు జవాబులను టిక్ పెడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి. చిత్రంలో శివప్రసన్న

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే ఆంధ్రప్రదేశ్‌కు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. 'జగనన్నే మా భవిష్యత్'లో భాగంగా మంగళవారం కాకినాడ సంజయ్‌నగర్‌లో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఇతర పార్టీ నాయకులతో కలసి ద్వారంపూడి ఇంటింటికీ వెళ్ళి 'జగనన్నే మా భవిష్యత్' లక్ష్యాలను వివరించారు. పలు ఇళ్లకు స్టిక్కర్లు అతికించి ప్రశ్నావళి ద్వారా ప్రజాభిప్రాయాన్ని స్వీకరించారు. టీడీపీ పాలనలో ప్రజలకు చేసిన దగా, ప్రస్తుత జగన్ పాలనలో పొందిన సంక్షేమాన్ని వారికి వివరించారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

నగరమంతా సందడి...

నగరంలో పలు డివిజన్లలో జగనన్నే మా భవిష్యత్‌తో సందడి నెలకొంది. జగన్నాథపురం ప్రాంతంలో కొడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ స్థానిక 39, 46 డివిజన్లలో కన్వీనర్లు, గృహసారథులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి పర్యటించారు. మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి బ్యాంకుపేట, రెల్లిపేట ప్రాంతాల్లో ఇళ్లకు స్టిక్కర్లు అతికించి జగన్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు.

తమ్మవరంలో జగనన్నే మా భవిష్యత్

కాకినాడ రూరల్: మండలంలోని తమ్మవరంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మంగళవారం సాయంత్రం 'జగనన్నే మా భవిష్యత్' నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, గత టీడీపీ పాలనలో వైఫల్యాలను ఎండగడుతూ 'మా నమ్మకం నువ్వే జగన్' స్టిక్కర్లను ఇళ్లకు అతికించారు. ప్రభుత్వ ప్రశ్నావళికి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో తమ్మవరం నాయకులు గొల్లపల్లి సత్తిరాజు, ఉప సర్పంచ్ గొల్లపల్లి దొరబాబు, కొల్లా భాస్కర్, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపిశెట్టి బాబ్జీ, నేమాం సర్పంచ్ రామదేవు చిన్న పాల్గొన్నారు.

తమ్మవరంలో గడప గడపకూ..

ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిని వివరించడమే లక్ష్యంగా తమ్మవరంలో అధికారులతో కలిసి ఎమ్మెల్యే కురసాల కన్నబాబు గడపగడపకూ తిరిగి మూడున్నరేళ్ళల్లో పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. ప్రజలు చెప్పిన సమస్యలు విని త్వరలో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. డీఎల్‌డీవో పాటంశెట్టి నారాయణమూర్తి, ఎంపీడీవో శ్రీనివాస్, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే మైనార్టీల సంక్షేమం



ఇఫ్తార్ విందులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి

కాకినాడ: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే ముస్లిం మైనార్టీల సంక్షేమానికి ఎంతో కృషి జరిగిందని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక రామకృష్ణారావుపేట మదీనా మసీదులో మంగళవారం ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రామకృష్ణారావుపేట ప్రాంతంలో ఉర్దూపాఠశాల, కమ్యూనిటీ హాలు నిర్మాణంతో సహా రూ.52 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. మరో 10 లక్షల అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధంగా ఉన్నాయన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, మదీనా మసీదు అధ్యక్షుడు కుతుబుద్దీన్ షరీఫ్, జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు రెహ్మాన్‌ఖాన్, మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు బాషా, నగరాధ్యక్షుడు ఖాలీద్ బిన్ వలీ పాల్గొన్నారు.

అన్నదాతకు మద్దతు ధరే ధ్యేయం

- బొండాలు రకం కొనుగోలుకు చర్యలు
- ఎమ్మెల్యే కన్నబాబు



వ్యవసాయ యంత్ర పరికరాలను ప్రారంభిస్తున్న జేసీ ఇలక్కియ, ఎమ్మెల్యే కన్నబాబు

కరప: అన్నదాత కష్టానికి మద్దతు ధర అందించడమే ధ్యేయంగా సీఎం జగన్ పనిచేస్తున్నారని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన జేసీ ఇలక్కియతో కలసి ప్రారంభించారు. దళారులను, రైసు మిల్లర్లను ఆశ్రయించి రైతు మోసపోకూడదనే సీఎం జగన్ ఆర్బీకేలు, వాటిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. అలాగే బొండాలు రకాన్నిన మద్దతు ధరకు కొనుగోలు చేసేలా కేంద్ర ప్రభుత్వంతో సీఎం జగన్ సంప్రదిస్తున్నట్టు తెలిపారు. జేసీ ఇలక్కియ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రబీపంట కొనుగోలు చేసేందుకు 215 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామన్నారు. బుధవారం నుంచి జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్టు ఆమె తెలిపారు. మద్దతు ధర కంటే తక్కువకు అడిగితే 1902, లేదా 155251 టోల్‌ఫ్రీ నంబర్లకు కానీ, జిల్లా కంట్రోల్ రూమ్ నంబరు 8886903611కు ఫోన్‌చేయాలన్నారు. జిల్లా పౌరసరఫరాలశాఖ డీఎం డి.పుష్పమణి మాట్లాడుతూ ధాన్యం విక్రయించగానే చెల్లింపులు చేస్తున్నామని, క్వింటాకు హమాలీ చార్జీ రూ.22, దూరాన్ని బట్టి రవాణా చార్జీలు చెల్లిస్తున్నట్టు తెలిపారు. జేడీఏ ఎన్.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మండల పరిధిలో 14,443 ఎకరాల్లో రబీ సాగుచేశారని, 41,160 మెట్రిక్‌టన్నుల ధాన్యం వస్తుందని అంచనా వేస్తున్నామన్నారు.

రాయితీపై వ్యవసాయ యంత్రపరికరాలు

ఈసందర్భంగా పలు గ్రామాలకు చెందిన సీహెచ్‌సీ గ్రూపు రైతులకు 40 శాతం రాయితీపై ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, రోటావేటర్లను ఎమ్మెల్యే కన్నబాబు, జేసీ ఇలాక్కియ, స్థానిక నాయకులు, అధికారులు అందజేశారు. వీటి ఖరీదు రూ.75,10,402 కాగా రూ 28,46,720 రాయితీ పోను డీసీసీబీ ద్వారా 37,55,202 రుణాలుగా ఇచ్చినట్టు ఏడీఏ కె.బాబూరావు తెలిపారు. ఎంపీడీఓ కర్రె స్వప్న, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, ఏడీఏ కె.బాబూరావు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, మండల వ్యవసాయ సలహాసంఘం అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరావు, జిల్లా సభ్యుడు బిరుదా చంటిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో సమృద్ధిగా తాగునీరు : ఏడీసీ



వేసవి జలాశయాన్ని సందర్శించిన ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: రానున్న వేసవిలో నీటి ఎద్దడి ఉండబోదని నగరపాలక సంస్థ ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు పేర్కొన్నారు. మంగళవారం ఆయన వాటర్ వర్క్స్ అధికారులతో కలసి అరట్లకట్ట వేసవి జలాశయాన్ని సందర్శించి దాని సామర్థ్యం, నిల్వ తదితర విషయాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వేసవి జలాశయాన్ని పూర్తిస్థాయిలో నింపేందుకు ఎనిమిది పంపుసెట్లను ఏర్పాటు చేశామని, ఇందుకు అవసరమైన జనరేటర్లను సైతం ఏర్పాటు చేసినట్టు ఏడీసీ తెలిపారు. జలాశయంలో 6.5 మీటర్ల నీటి నిల్వ సామర్థ్యం ఉందని ఇప్పటి వరకు 3.2 మీటర్లు నీటితో నింపామన్నారు. వారం రోజుల్లో పూర్తిస్థాయిలో నింపుతామని తెలిపారు.

ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



ఐఎఫ్‌టీయు జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ: స్థానిక కచేరిపేటలోని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఆ సంఘం జిల్లా నాయకులు ఆ సంఘం జిల్లా నాయకులు జి.రాజ్‌కుమార్, మాగాపు రాజు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జి.సూరిబాబు, గ్యాస్ వర్కర్ల సంఘం నాయకులు సుబ్రహ్మణ్యం, అడపా రాజు, వెంకటేష్, సతీష్, మనోజ్‌లు ఐఎఫ్‌టీయూ జాతీయ మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. వక్తలు మాట్లాడుతూ లేబర్ కోడ్‌ల రద్దుకు, కార్మిక చట్టాల అమలుకు పోరాడదామని పిలుపునిచ్చారు. ఐఎఫ్‌టీయు జాతీయ మహాసభలలో గత పోరాటాలను, సమీక్షించి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారని, నూతన జాతీయ కమిటీని ఎన్నుకుంటారని తెలిపి, కార్మికులందరూ పాల్గొని జాతీయసభలను విజయవంతం చేయాలన్నారు.

నూకాలమ్మ ఆలయంలో సామూహిక పూజలు



ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

సామర్లకోట: స్థానిక స్టేషన్ సెంటర్‌లోని నూకాలమ్మ తల్లి ఆలయంలో మంగళవారం సామూహిక పూజలు చేశారు. కొత్త అమావాస్య పూజల సందర్భంగా పిఠాపురానికి చెందిన సంగీత కళాకారుడు ఆకొండి వెంకట్రావు ఆధ్వర్యంలో సుందరకాండ పారాయణ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త వల్లూరి బుల్లియ్య ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ నాయకులు, పారాయణ కమిటీ నాయకులు యార్లగడ్డ శ్రీను, పెనుమర్తి సత్యనారాయణ, గోలి రాంబాబు, మార్ని శ్రీనివాసు, మద్దుకూరి జోగారావు, పేకేటి చిరంజీవి భక్తులకు సేవలందించారు.

మత్స్యకారుల వికాసానికి తోడ్పాటు

- ఎమ్మెల్యే కురసాల కన్నబాబు
- రూ.60లక్షలతో నిర్మించిన సామాజిక భవనం ప్రారంభం
- సహకరించిన కోరమాండల్‌కు అభినందనలు



వాకలపూడిలో మత్స్యకార సామాజిక వికాస భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కాకినాడ రూరల్: మత్స్యకారుల వికాసానికి తోడ్పడతామని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు పేర్కొన్నారు. మండలంలోని వాకలపూడిలో రూ.60 లక్షతో నిర్మించిన మత్స్యకార సామాజిక వికాస భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. జీవితంలో గుర్తుండిపోయే పనుల్లో ఈ భవనం ప్రారంభం ఒకటని ఎమ్మెల్యే కురసాల అన్నారు. తాను ఎమ్మెల్యేగా శంకుస్థాపన చేసిన భవనం పనులను టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయగా మళ్లీ తమ ప్రభుత్వంలో తానే ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరు చేయగా, కోరమాండల్ సంస్థ సీఎస్సార్ నిధుల కింద రూ.30 లక్షలు సమకూర్చిందని, దీంతో అత్యంత సుందరంగా ఈ భవనం రూపుదిద్దుకుందన్నారు. ఇందుకు ఆ సంస్థను అభినందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, గోపుశెట్టి బాబ్జీ, డీఎల్‌డీఓ నారాయణమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాస్, కోరమాండల్ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు, హెచ్ఆర్ హెడ్ పద్మనాభం, సీఎస్సార్ హెడ్ వంశీకృష్ణ, వాకలపూడికి చెందిన స్టేట్ వేర్‌హౌసింగ్ డైరెక్టర్ గంపల రాణి, మత్స్యకార నాయకుడు అబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

అలాగే వాకలపూడిలో రూ.40 లక్షలతో నిర్మించనున్న శ్రీనివాసనగర్ సచివాలయం–3 నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాండురంగారావు, సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సీఎస్సార్ నిధులతో పారిశుధ్య ట్రాక్టర్లు

మండలంలోని వాలకపూడి, వలసపాకల గ్రామాల్లో పారిశుధ్య పనులకు కోరమండల్ సంస్థ రూ.22 లక్షల విలువైన రెండు ట్రాక్టర్లను సమకూర్చింది. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు వీటిని ప్రారంభించి పంచాయతీ కార్యదర్శులు బీబీ, పాండురంగాలకు అప్పగించారు. డీఎల్‌డీఓ నారాయణమూర్తి, జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, కోరమాండల్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ ప్రదీప్, యూనిట్ హెడ్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బోధనా నైపుణ్యంపై సదస్సు

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఇన్ టీచింగ్ లెర్నింగ్ ఇవాల్యుయేషన్ ఆధ్వర్యంలో బోధనా నైపుణ్యంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్‌గా బోటనీ అధ్యాపకులు ఎ.శ్రీనివాస్ ఇన్నోవేటివ్ టూల్స్ ఇన్ టీచింగ్ లెర్నింగ్ అంశంపై వివరించగా 90 మంది అధ్యాపకులు పాల్గొని టీచింగ్ మెళుకువలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టీచింగ్ లెర్నింగ్ ఇవాల్యుయేషన్ కమిటీ డైరెక్టర్ పాలపర్తి శారా, అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు జ్యోతిరావు పూలే



పూలేకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు తదితరులు



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు

కాకినాడ రూరల్: రమణయ్యపేట వైద్యనగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటానికి నివాళులు అర్పించారు. బీసీ వర్గాలతో పాటు అన్ని వర్గాల వారు పూలేను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. అనంతరం వాలపూడి సచివాలయం–3 నూతన భవనం వద్ద, వాకలపూడి మత్స్యకార సామాజిక వికాస భవనం వద్ద పూలేకు నివాళులు అర్పించారు. జెడ్పీటీసీ నురుకుర్తి రామకృష్ణ, సీనియర్ నాయకుడు గోపుశెట్టి బాబ్జీ, జాన్ ప్రభాకర్, పుల్ల కోటేశ్వరరావు, లింగం రవి, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట జంక్షన్‌లోని నన్నయ వర్సిటీ ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో పూలే చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ కమలకుమారి, డాక్టర్ పోచయ్య తదితరులు నివాళులర్పించారు. అలాగే బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత తహసీల్దార్ రేలంగి బాపిరాజు, మాజీ సర్పంచ్ అడబాల రత్నప్రసాద్ తదితరులు పూలేకు నివాళులు అర్పించారు.



కరపలో పూలేకు నివాళులర్పిస్తున్న ఐక్యవేదిక నాయకులు

కరపలో..

కరప: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి అధ్యక్షతన జ్యోతిరావు పూలేకు నివాళులు అర్పించారు. పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు, అప్పనపల్లి పెద్ద, అడబాల ప్రసాద్, ఎంపీడీఓ కర్రె స్వప్న, కార్యాలయం ఏఓ గుత్తుల భీమశంకరరావు, సిబ్బంది వీవీఎస్ వీరేష్, జీవీసీహెచ్ రాయుడు, టి.సురేష్ తదితరులు పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ పేపకాయల మాచరావు, వీఆర్వోలు పూలేకు నివాళులు అర్పించారు.

ఐక్య వేదిక ఆధ్వర్యంలో..

కరప: దళిత, గిరిజన, బీసీ, ముస్లిం, క్రైస్తవ ఐక్యవేదిక అధ్యక్షుడు డోకుబుర్ర భద్రం కాకినాడ పాత బస్టాండ్ వద్ద గల జ్యోతిరావు పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు షేక్ హుసేన్, జనరల్ సెక్రటరీ భువనగిరి బాలభద్రరావు, ట్రెజరర్ కొండేపూడి రవికుమార్, దాకారపు వరప్రసాద్, ఎండీ హలీం, షేక్ అబ్దుల్లా తదితరులు పాల్గొన్నారు.

పూలేకు ఎస్పీ నివాళులు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి నిర్వహించారు. పూలే చిత్రపటానికి ఎస్పీ రవీంద్రనాథ్‌బాబు నివాళులర్పించారు.